"మధురమైన పిల్లలూ - పిల్లలైన మిమ్మల్ని తమ సమానముగా మహిమా యోగ్యులుగా తయారుచేయడానికి బాబా వచ్చారు, తండ్రి మహిమ ఏదైతే ఉందో, దానిని ఇప్పుడు మీరు ధారణ చేస్తారు"

ప్రశ్న:- భక్తి మార్గములో ప్రియుడైన పరమాత్ముని గురించి పూర్తిగా తెలియకపోయినా కానీ ఏ పదాలతో చాలా ప్రేమగా మాట్లాడుతారు మరియు స్మృతి చేస్తారు?

జవాబు:- ఓ ప్రియతముడా, మీరు ఎప్పుడైతే వస్తారో, అప్పుడు మేము కేవలం మిమ్మల్నే స్మృతి చేస్తాము, మిగిలినవారందరి నుండి బుద్ధియోగాన్ని తెంచి మీతో జోడిస్తాము అని చాలా ప్రేమగా మాట్లాడుతారు మరియు స్మృతి చేస్తారు. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, నేను వచ్చాను కావున దేహీ-అభిమానులుగా అవ్వండి. మీ మొదటి కర్తవ్యము - ప్రేమగా తండ్రిని స్మృతి చేయడము.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పతితులను పావనముగా తయారుచేసే తండ్రి వ్యాపారము ఏదైతే ఉందో, ఆ వ్యాపారమే చేయాలి. తండ్రిని స్మృతి చేయండి మరియు పావనముగా అవ్వండి అని అందరికీ లక్ష్యము ఇవ్వాలి.
2. ఈ బ్రాహ్మణ జీవితము దేవతల కన్నా ఉత్తమమైన జీవితము, ఈ నషాలో ఉండాలి. బుద్ధియోగాన్ని మిగిలినవారందరి నుండి తెంచి ఒక్క ప్రియుడిని స్మృతి చేయాలి.

వరదానము:- త్యాగము మరియు స్నేహము యొక్క శక్తి ద్వారా సేవలో సఫలతను ప్రాప్తి చేసుకునే స్నేహీ సహయోగీ భవ

ఏ విధముగా ప్రారంభములో జ్ఞానము యొక్క శక్తి తక్కువగా ఉండేది కానీ త్యాగము మరియు స్నేహము ఆధారముగా సఫలత లభించింది. బుద్ధిలో రాత్రింబవళ్ళు బాబా మరియు యజ్ఞము వైపే తపన ఉండేది, బాబా మరియు యజ్ఞము అన్న మాటలు ఎంతో ప్రేమగా వెలువడేవి. ఈ స్నేహమే అందరినీ సహయోగములోకి తీసుకువచ్చింది. ఈ శక్తితోనే సేవాకేంద్రాలు తయారయ్యాయి. సాకార స్నేహము ద్వారానే మన్మనాభవగా అయ్యారు, సాకార స్నేహమే సహయోగులుగా చేసింది. ఇప్పుడు కూడా త్యాగము మరియు స్నేహము యొక్క శక్తితో చుట్టుముట్టినట్లయితే సఫలత లభిస్తుంది.

స్లోగన్:- ఫరిశ్తాలుగా అవ్వాలంటే వ్యర్థమైన మాటలు మరియు డిస్టర్బ్ చేసే మాటల నుండి ముక్తులుగా అవ్వండి.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఏ విషయము జరిగినా కానీ, ప్రకృతికి సంబంధించినది అయినా, వ్యక్తులకు సంబంధించినది అయినా, రెండూ అచంచల స్థితి అనే ఆసనాన్ని కొంచెము కూడా కదిలించలేవు. ఇంత పక్కాగా ఉన్నారు కదా! ఏ విధముగా శరీరమనేది ఆసనముపై సరిగ్గా స్థితి అవ్వకపోతే అలజడి కలుగుతుంది కదా! అలా మనసు అలజడినైతే కలిగించటం లేదు కదా? సదా అచంచలము-స్థిరము, కొంచెము కూడా అలజడి ఉండకూడదు. ఒకవేళ ఒక్కోసారి అలజడి, ఒక్కోసారి అచల స్థితి ఉన్నట్లయితే సింహాసనము కూడా ఒక్కోసారి లభిస్తుంది, ఒక్కోసారి లభించదు.

12-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు వినాశన సమయము చాలా సమీపముగా ఉంది, అందుకే ఒక్క తండ్రితో సత్యమైన ప్రీతిని ఉంచుకోండి, ఏ దేహధారులతోనూ కాదు"

ప్రశ్న:- ఏ పిల్లలకైతే ఒక్క తండ్రితో సత్యమైన ప్రీతి ఉంటుందో వారి గుర్తులు ఏమిటి?

జవాబు:- 1. వారి బుద్ధియోగము ఏ దేహధారుల వైపుకు వెళ్ళలేదు. వారు పరస్పరము ఒకరికొకరు ప్రేయసీ-ప్రియులుగా అవ్వరు. 2. ఎవరికైతే సత్యమైన ప్రీతి ఉంటుందో, వారు సదా విజయులుగా అవుతారు. విజయులుగా అవ్వడము అనగా సత్యయుగ మహారాజా-మహారాణులుగా అవ్వడము. 3. ప్రీతి బుద్ధి కలవారు తండ్రితో సదా సత్యముగా ఉంటారు. వారు ఏదీ దాచిపెట్టలేరు. 4. ప్రతిరోజు అమృతవేళ లేచి ప్రేమగా తండ్రిని స్మృతి చేస్తారు. 5. దధీచి ఋషి వలె సేవలో ఎముకలను ఇస్తారు. 6. వారి బుద్ధి ప్రాపంచిక విషయాలలో భ్రమించలేదు.

పాట:- వారు మా నుండి వేరు కారు...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అమృతవేళ ఏకాంతములో కూర్చుని తండ్రిని ప్రేమగా స్మృతి చేయాలి. ప్రాపంచిక విషయాలను వదిలి ఈశ్వరీయ సేవలో నిమగ్నమవ్వాలి.
2. తండ్రి పట్ల సత్యమైన హృదయము పెట్టుకోవాలి. పరస్పరము మీలో మీరు ప్రేయసీ-ప్రియులుగా అవ్వకూడదు. ప్రీతిని ఒక్క తండ్రితో జోడించాలి, దేహధారులతో కాదు.

వరదానము:- సర్వశక్తుల సంపదతో సంపన్నముగా అయి దాతగా అయ్యే విధాత, వరదాత భవ

ఏ పిల్లలైతే సర్వశక్తుల సంపద కలిగి ఉన్నారో, వారే సంపన్న మరియు సంపూర్ణ స్థితి యొక్క సమీపతను అనుభవము చేస్తారు. వారిలో ఎలాంటి భక్తితో కూడిన సంస్కారాలు గాని, బికారీతనపు సంస్కారాలు గాని ఇమర్జ్ అవ్వవు. తండ్రి నుండి సహాయము కావాలి, ఆశీర్వాదాలు కావాలి, సహయోగము కావాలి, శక్తి కావాలి - ఈ 'కావాలి' అన్న పదము దాత, విధాత, వరదాత పిల్లలకు ఏ మాత్రమూ శోభించదు. వారు విశ్వములోని ప్రతి ఆత్మకు ఏదో ఒక దానాన్ని మరియు వరదానాలను ఇచ్చేవారిగా ఉంటారు.

స్లోగన్:- ప్రతి ఆత్మకు ఏదో ఒక ప్రాప్తిని కలిగించే వచనాలే సత్యమైన వచనాలు.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఎవరు ఎంతగా కదిలించినా కానీ మీరు అచలముగా ఉండండి. పరిస్థితి శ్రేష్ఠమైనదా లేక స్వస్థితి శ్రేష్ఠమైనదా? పరిస్థితి ఎప్పుడూ దాడి చెయ్యటము లేదు కదా? ఆలోచించండి, ఈ పరిస్థితి శక్తిశాలినా లేక స్వస్థితి శక్తిశాలినా? ఈ స్మృతి ద్వారా బలహీనుల నుండి శక్తిశాలిగా అవుతారు. తపస్వీలైన మీరు ఏకరస స్థితిలో ఏకాగ్రులవుతారు, హఠయోగులు ఒంటి కాలిపై నిలబడతారు. మరి ఏకరస స్థితి ఎక్కడ, ఒంటి కాలిపై నిలబడి ఉండటము ఎక్కడ, తేడా ఉంది కదా!

"మధురమైన పిల్లలూ - తండ్రి ద్వారా మీకు సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానమేదైతే లభించిందో, దానిని మీరు బుద్ధిలో ఉంచుకుంటారు, అందుకే మీరు స్వదర్శన చక్రధారులు"

ప్రశ్న:- ఆత్మను పావనముగా చేయడానికి ఆత్మిక తండ్రి ఏ ఇంజెక్షన్‌ను ఇస్తారు?

జవాబు:- మన్మనాభవ అనే ఇంజెక్షన్‌ను. ఈ ఇంజెక్షన్‌ను ఆత్మిక తండ్రి తప్ప ఇంకెవ్వరూ ఇవ్వలేరు. తండ్రి అంటారు – మధురమైన పిల్లలూ, మీరు నన్ను స్మృతి చేయండి, అంతే. స్మృతితోనే ఆత్మ పావనముగా అయిపోతుంది. ఇందులో సంస్కృతము మొదలైనవి చదవాల్సిన అవసరము కూడా లేదు. తండ్రి అయితే హిందీలో స్పష్టమైన పదాలతో వినిపిస్తారు. ఆత్మకు ఎప్పుడైతే, మేము పావనముగా అయ్యేందుకు ఆత్మిక తండ్రి యుక్తులను తెలియజేస్తున్నారు అన్న నిశ్చయము ఏర్పడుతుందో, అప్పుడు వికారాలను వదులుతూ వెళ్తుంది.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి నుండి ఏ జ్ఞానామృతమైతే లభిస్తుందో, ఆ అమృతాన్ని తాగాలి మరియు తాగించాలి. పూజారుల నుండి పూజ్యులుగా అయ్యేందుకు వికారాలను త్యజించాలి.
2. ఏ తండ్రి అయితే స్వర్గములోకి వెళ్ళేందుకు యోగ్యులుగా తయారుచేస్తున్నారో, వారి ప్రతి మాటను వినాలి, పూర్తి నిశ్చయబుద్ధి కలవారిగా అవ్వాలి.

వరదానము:- అనుభవము యొక్క విల్ పవర్ ద్వారా మాయ పవర్‌ను ఎదుర్కునే అనుభవీ మూర్త భవ

అన్నింటికంటే శక్తిశాలి స్థితి – మీ అనుభవము. అనుభవీ ఆత్మ తన అనుభవము యొక్క విల్ పవర్‌తో మాయ యొక్క ఏ పవర్‌ను అయినా, అన్ని విషయాలను, సర్వ సమస్యలను సహజముగానే ఎదుర్కోగలదు మరియు ఆత్మలందరినీ సంతుష్టము కూడా చేయగలదు. అనుభవము యొక్క విల్ పవర్ ఆధారముగా ఎదుర్కునే శక్తితో సర్వులను సంతుష్టపరిచే శక్తి సహజముగా ప్రాప్తిస్తుంది. అందుకే ప్రతి ఖజానాను అనుభవములోకి తీసుకువచ్చి అనుభవీ మూర్తులుగా అవ్వండి.

స్లోగన్:- ఇతరులను చూసేందుకు బదులుగా స్వయాన్ని చూసుకోండి మరియు పరివర్తన చేసుకోండి.

అవ్యక్త ప్రేరణలు

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

మిమ్మల్ని మీరు చెక్ చేసుకోండి – ప్రతి శక్తి, ప్రతి ప్రాప్తి, ప్రతి గుణము యొక్క అనుభవము ఉందా? ఒకవేళ అనుభవము యొక్క అథారిటీ ఉన్నట్లయితే ఎటువంటి పరిస్థితి అయినా కానీ అది అనుభవమనే అథారిటీ ముందు ఎటువంటి ప్రభావాన్ని చూపించలేదు. అనుభవీమూర్తులు ఎప్పుడైనా, ఎటువంటి పరిస్థితిలోనైనా అచంచలముగా–స్థిరముగా ఉంటారు, అలజడిలోకి రారు, ఎందుకంటే అన్నింటికంటే అతి పెద్ద అథారిటీ అనుభవము యొక్క అథారిటీ. ఏ సమయములో ఏ శక్తిని ఆహ్వానిస్తారో, అది క్షణములో సహయోగిగా అవుతుంది.

14-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఏ విధముగా బాబా ప్రేమ సాగరుడో, ఏ విధముగా ప్రపంచములో ఎవరూ వారిలా ప్రేమించలేరో, అలా పిల్లలైన మీరు కూడా తండ్రి సమానముగా అవ్వండి, ఎవరినీ దుఃఖ పెట్టకండి"

ప్రశ్న:- ఏ రకమైన ఆలోచనలు నడుస్తూ ఉన్నట్లయితే సంతోషము యొక్క పాదరసము పైకి ఎక్కి ఉంటుంది?

జవాబు:- ఇప్పుడు మేము జ్ఞాన రత్నాలతో మా జోలెను నింపుకుంటున్నాము, తర్వాత ఈ గనులు మొదలైనవన్నీ నిండుగా అయిపోతాయి. అక్కడ (సత్యయుగములో) మేము బంగారు మహళ్ళను నిర్మిస్తాము. 2. మా ఈ బ్రాహ్మణ కులము ఉత్తమమైన కులము, మేము సత్యాతి-సత్యమైన సత్యనారాయణుని కథను, అమరకథను వింటాము మరియు వినిపిస్తాము... ఇటువంటి ఆలోచనలు నడుస్తూ ఉన్నట్లయితే సంతోషపు పాదరసము పైకి ఎక్కి ఉంటుంది.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎటువంటి తప్పుడు మాటలను విశ్వసించకూడదు. ఇంతవరకు ఏవైతే తప్పుడు విషయాలను చదివారో, వాటిని మరచి అశరీరిగా అయ్యే అభ్యాసము చేయాలి.
2. కేవలం ఆశీర్వాదాలపైనే ఆధారపడకూడదు, స్వయాన్ని పవిత్రముగా తయారుచేసుకోవాలి. తండ్రిని ప్రతి అడుగులోనూ ఫాలో చేయాలి. ఎవరికీ దుఃఖము ఇవ్వకూడదు. ఎవరినీ బాధ పెట్టకూడదు.

వరదానము:- సత్యమైన లగనము (తపన, ప్రేమ) ఆధారముగా ఇతర సాంగత్యాలను తెంచి ఒక్కరితోనే సాంగత్యాన్ని జోడించే సంపూర్ణ విశ్వాసపాత్ర భవ

సంపూర్ణ విశ్వాసపాత్రులు అని ఎవరిని అంటారంటే - ఎవరి సంకల్పము మరియు స్వప్నములో కూడా కేవలం తండ్రి, తండ్రి కర్తవ్యాలు, తండ్రి మహిమ మరియు తండ్రి జ్ఞానము తప్ప ఇంకేదీ కనిపించదో, వారిని. ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ లేరు... బుద్ధి యొక్క లగనము సదా ఒక్కరి సాంగత్యములోనే ఉంటే అనేక సాంగత్యాల రంగు అంటుకోదు. అందుకే మొదటి ప్రతిజ్ఞ ఏమిటంటే - ఇతర సాంగత్యాలను తెంచి ఒక్కరితోనే సాంగత్యాన్ని జోడిస్తాను - ఈ ప్రతిజ్ఞను నిలబెట్టుకోవడం అనగా సంపూర్ణ విశ్వాసపాత్రులుగా అవ్వడము.

స్లోగన్:- సత్యత యొక్క స్వ-స్థితి పరిస్థితులలో కూడా సంపూర్ణముగా తయారుచేస్తుంది.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

మనము ఉన్నతోన్నతుడైన తండ్రికి పిల్లలము, ఇది గుర్తున్నట్లయితే ఏకరస అవస్థ ఉంటుంది. ఎప్పుడైతే ఒక్కరితోనే సంబంధము ఉంటుందో, అప్పుడు అవస్థ కూడా ఏకరసముగా ఉంటుంది. ఒకవేళ ఇంకే సంబంధము వైపుకైనా మోహము కలుగుతున్నట్లయితే ఏకరస అవస్థ ఉండదు. కావున ఏకరస అవస్థను తయారుచేసుకునేందుకు ఒక్కరిని తప్ప ఇంక దేనినైనా చూస్తూ కూడా చూడకండి.

"మధురమైన పిల్లలూ - ఈ ప్రపంచము శ్మశానవాటికగా అవ్వనున్నది, అందుకే దీనిపై మనసు పెట్టుకోకండి, పరిస్తాన్‌ను స్మృతి చేయండి"

ప్రశ్న:- పేద పిల్లలైన మీ వంటి అదృష్టవంతులు ప్రపంచములో ఎవరూ లేరు, ఎందుకు?

జవాబు:- ఎందుకంటే పేద పిల్లలైన మీరే డైరెక్టుగా ఆ తండ్రికి చెందినవారిగా అయ్యారు, వారి నుండి సద్గతి యొక్క వారసత్వము లభిస్తుంది. పేద పిల్లలే చదువుకుంటారు. షావుకారులు ఒకవేళ కొద్దిగా చదువుకున్నా కూడా, వారికి తండ్రి స్మృతి కష్టము మీద నిలుస్తుంది. మీకైతే అంతిమములో తండ్రి తప్ప ఇంకేదీ గుర్తుకు రాదు, అందుకే మీరు అందరికన్నా అదృష్టవంతులు.

పాట:- మనసు యొక్క ఆధారము తెగిపోకూడదు...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్వయము రిఫ్రెష్‌గా ఉంటూ, ఇతరులను రిఫ్రెష్ చేసేందుకు తండ్రి మరియు వారసత్వము యొక్క స్మృతిలో ఉండాలి మరియు అందరికీ స్మృతిని ఇప్పించాలి.
2. ఈ పాత ప్రపంచము పట్ల, ఈ శ్మశానవాటిక పట్ల మనసు పెట్టుకోకూడదు. శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేయాలి. స్వయాన్ని దేవతలుగా అయ్యేందుకు యోగ్యులుగా తయారుచేసుకోవాలి.

వరదానము:- ఈశ్వరీయ అథారిటీ ద్వారా సంకల్పాలను మరియు బుద్ధిని ఆర్డర్ అనుసారముగా నడిపించే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

ఎలాగైతే స్థూలమైన చేతులు, కాళ్ళను చాలా సహజమైన రీతిలో ఎక్కడ కావాలనుకుంటే అక్కడ నడిపిస్తారో లేదా కర్మలు చేయడానికి ఉపయోగిస్తారో, అలాగే సంకల్పాలను మరియు బుద్ధిని ఎక్కడ పెట్టాలనుకుంటే అక్కడ పెట్టగలగాలి - దీనినే ఈశ్వరీయ అథారిటీ అని అంటారు. ఏ విధముగా వాణిలోకి రావడము సహజమో, అలాగే వాణి నుండి అతీతముగా వెళ్ళడము కూడా అంతే సహజమవ్వాలి, ఈ అభ్యాసముతోనే సాక్షాత్కార మూర్తులుగా అవుతారు. ఇప్పుడు ఈ అభ్యాసాన్ని సహజము మరియు నిరంతరము చేసుకోండి, అప్పుడు మాస్టర్ సర్వశక్తివంతులని అంటారు.

స్లోగన్:- స్వస్థితి శక్తిశాలిగా ఉన్నట్లయితే పరిస్థితి దాని ముందు ఏమీ కాదు.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

మీ ఏకరస అచంచల స్థితి యొక్క స్మృతిచిహ్నమే ఈ అచల్‌ఘర్. ఏ విధముగా బాప్‌దాదా ఏకరసముగా ఉంటారో అలా పిల్లలు కూడా ఏకరసముగా ఉండాలి. ఎప్పుడైతే ఒక్కరి రసములోనే (తపనలోనే) ఉంటారో, అప్పుడు ఏకరస అవస్థలో ఉంటారు. ఎందుకు అన్న మాటకు గుర్తు ప్రశ్నార్థకము, ఇది అన్నింటికన్నా వంకరగా ఉంటుంది. ఎప్పుడైతే ఎందుకు, ఏమిటి అన్న మాటలు తొలగిపోతాయో, అప్పుడు నిశ్చితమై ఉన్న డ్రామా విధిపై ఏకరసముగా, స్థిరముగా ఉండగలరు.

"మధురమైన పిల్లలూ - సదా గుర్తుంచుకోండి - చాలా సమయము గడిచిపోయింది, ఇక కొద్ది సమయమే మిగిలి ఉంది, ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి, ఈ భీ-భీ శరీరాన్ని మరియు ప్రపంచాన్ని మర్చిపోవాలి"

ప్రశ్న:- ఏ నషా నిరంతరము ఉన్నట్లయితే స్థితి చాలా ఫస్ట్ క్లాస్‌గా ఉంటుంది?

జవాబు:- నిరంతరము ఈ నషా ఉండాలి - వేటగానికి అది వేట, వేటకు అది మృత్యువు. మనము ఫరిశ్తాలుగా అయి మన ప్రియునితో పాటు ఇంటికి వెళ్తాము, మిగిలినదంతా సమాప్తమవ్వనున్నది. ఇప్పుడు మనము ఈ పాత చర్మాన్ని వదిలి కొత్తది తీసుకుంటాము. ఈ జ్ఞానము రోజంతా బుద్ధిలో చుక్క-చుక్కగా పడుతూ ఉన్నట్లయితే అపారమైన సంతోషము ఉంటుంది. స్థితి ఫస్ట్ క్లాస్‌గా తయారవుతుంది.

పాట:- ఈ రోజు ఉదయాన్నే ఎవరు వచ్చారు...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అతీంద్రియ సుఖాన్ని అనుభవం చేసేందుకు దేహ భానాన్ని తెంచే పురుషార్థము చేయాలి. ఇప్పుడు తిరిగి ఇంటికి వెళ్ళాలి, అందుకే బుద్ధియోగము ఇంటితో జోడించబడి ఉండాలి.
2. గృహస్థ వ్యవహారములో ఉంటూ చదువును కూడా చదువుకోవాలి, డబల్ కోర్స్ చేయాలి. జ్ఞాన స్నానాన్ని మరియు స్మృతియాత్రను చేయాలి మరియు చేయించాలి.

వరదానము:- కోమలతను కమాల్‌లోకి (అద్భుతములోకి) పరివర్తన చేసి మాయాజీతులుగా అయ్యే శక్తి స్వరూప భవ

శక్తి స్వరూపముగా అయ్యేందుకు కోమలతను అద్భుతములోకి పరివర్తన చేయండి. కేవలం స్వయం యొక్క సంస్కారాలను పరివర్తన చేసుకోవడములో కోమలముగా అవ్వండి. కర్మలలో ఎప్పుడూ కోమలముగా అవ్వకండి, ఇందులో శక్తి రూపులుగా అవ్వాలి. ఎవరైతే శక్తి రూపము యొక్క కవచాన్ని ధారణ చేస్తారో, వారికి మాయ యొక్క ఏ బాణము తగలదు. అందుకే మీ ముఖము, నయనాల ద్వారా కోమలత్వానికి బదులుగా శక్తి రూపము కనిపించాలి, అప్పుడు మాయాజీతులుగా అయి పాస్ విత్ ఆనర్ యొక్క సర్టిఫికెట్‌ను తీసుకోగలుగుతారు.

స్లోగన్:- త్రికాలదర్శి సీటుపై సెట్ అయి ప్రతి కర్మను చేసినట్లయితే మాయ దూరం నుండే పారిపోతుంది.

అవ్యక్త ప్రేరణలు

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఏ విధముగా సాకార బాబా అలసిపోనివారిగా ఉంటూ ఏకరస స్థితికి ఉదాహరణగా అయ్యి చూపించారో, అదే విధముగా పిల్లలైన మీరు కూడా ఇతరులకు ఉదాహరణగా అవ్వాలి, ఇదే సేవ. సేవ అనేది కేవలం వాణి ద్వారా జరగదు, స్థితి ద్వారా కూడా సేవ జరుగుతుంది. కావున సమయమనుసారముగా ఇప్పుడు మీ స్థితిని ఏకరసముగా తయారుచేసుకోండి.

17-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్-11-02-2010 మధువనం

"శివుని జన్మదినము రోజున క్రోధము రూపీ జిల్లేడు పుష్పాలను బాప్‌దాదాకు అర్పించి దర్పణముగా అవ్వండి, పవిత్ర ప్రవృత్తి యొక్క ప్రత్యక్ష ప్రమాణము ద్వారా ప్రత్యక్షతను సమీపంగా తీసుకురండి"

- ఈరోజు పిల్లలందరూ సమ్ముఖంలో కూర్చున్నవారు మరియు దేశ-విదేశాలలో నలువైపులా ఉన్న పిల్లలు చాలా సంతోషంతో తండ్రి యొక్క జన్మదినాన్ని మరియు తమ జన్మదినాన్ని జరుపుకుంటున్నందుకు అనేకానేక అభినందనలను, శుభాకాంక్షలను ఇస్తున్నారు.
- ఏ విధంగా పవిత్రతా వ్రతాన్ని ధైర్యంతో తమ స్వధర్మముగా భావిస్తూ ధారణ చేసారో అదే విధముగా రెండవ భూతము క్రోధము. క్రోధమనే భూతముపై విజయము పొందాలని కూడా సంకల్పము చేసారా. ఈరోజు బాప్‌దాదా పిల్లలందరి నుండి క్రోధమనే కానుకను తీసుకోవాలనుకుంటున్నారు. ఒకవేళ క్రోధంపై విజయము పొందినట్లయితే వేరే వాటిపై (ఇతర వికారాలపై) కూడా విజయము పొందగలము అన్న ధైర్యము వస్తుంది.
- వ్యర్థ సంకల్పాల బీజము కూడా క్రోధాన్ని తీసుకువస్తుంది ఎందుకంటే వ్యర్థ సంకల్పాలు బీజము, ఈ బీజము నుండి క్రోధము కూడా ఉత్పన్నమవుతుంది మరియు దీనికి ఒక్క పదము కారణమవుతుంది. ఆ ఒక్క పదము యొక్క బీజాన్ని ఒకవేళ సమాప్తం చేసినట్లయితే సహజమైపోతుంది. ఆ ఒక్క పదము - 'ఎందుకు', ఇది ఎందుకు? ఇది ఎందుకు జరిగింది? ఇలా ఎందుకు చేసారు? ఇలా ఎందుకు చేస్తారు? ఈ 'ఎందుకు' అన్న పదానికి చాలా పెద్ద క్యూ ఉంది.
- పూర్వజులు ఏ ఆత్మ యొక్క దుఃఖాన్ని కానీ డిస్టర్బెన్సును కానీ చూడలేరు, ఎవరిపైనైతే ప్రేమ ఉంటుందో, దయ ఉంటుందో వారి దుఃఖాన్ని చూడలేరు. సమయము మిమ్మల్ని పరివర్తన చేసే కన్నా ముందే మీరు పురుషార్థపు ప్రాప్తి యొక్క ప్రారబ్ధాన్ని ఇప్పటి నుండి అనుభవము చేయండి ఎందుకంటే మీకు నేర్పించేది సమయము కాదు, సమయము మీ టీచరు కాదు.

వరదానము:- అందరికీ గౌరవాన్ని ఇస్తూ తమ రికార్డును సరిగ్గా ఉంచుకునే సర్వుల స్నేహీ భవ

ఎవరు ఎంతగా అందరికీ గౌరవాన్ని ఇస్తారో, వారు అంతగానే తమ రికార్డును సరిగ్గా ఉంచుకోగలరు. ఇతరుల పట్ల గౌరవాన్ని ఉంచడము అంటే తమ రికార్డును తయారుచేసుకోవడము. ఏ విధంగా యజ్ఞానికి సహాయకులుగా అవ్వడమే సహాయము తీసుకోవడమో, అదే విధంగా గౌరవాన్ని ఇవ్వడమే గౌరవాన్ని తీసుకోవడము. ఒక్కసారి ఇవ్వడమంటే అనేక సార్లు తీసుకునేందుకు హక్కుదారులుగా అవ్వడము. చిన్నవారికి ప్రేమనివ్వండి మరియు పెద్దవారికి గౌరవాన్ని ఇవ్వండి అని అంటూ ఉంటారు కానీ ఎవరైతే అందరినీ పెద్దవారిగా భావిస్తూ గౌరవాన్ని ఇస్తారో, వారు అందరికీ స్నేహీలుగా అవుతారు. దీని కొరకు ప్రతి విషయంలో "ముందు మీరు" అన్న పాఠాన్ని పక్కా చేసుకోండి.

స్లోగన్:- బాప్ దాదా ద్వారా లభించిన శిక్షణలు సమయానికి గుర్తు రావడమే తీవ్ర పురుషార్థము.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఎవరైతే ఆల్‌రౌండ్ సేవ చేస్తారో, వారికి విశేషంగా ఈ విషయంపై ధ్యాస ఉండాలి - ఎటువంటి పరిస్థితిలోనైనా సరే, స్థితి ఏకరసంగా ఉండాలి, అప్పుడే సఫలత లభిస్తుంది. శ్రీమతములో ఎప్పుడైతే మన్మతము, దేహ-అభిమానపు మతము, శూద్రతనపు మతము మిక్స్ చేస్తారో, అప్పుడు స్థితి ఏకరసంగా ఉండదు. మనసు భిన్న-భిన్న రసాలలో ఉన్నట్లయితే స్థితి కూడా రకరకాలుగా ఉంటుంది. ఒక్కరి రసములోనే ఉన్నట్లయితే స్థితి ఏకరసంగా ఉంటుంది.